క్లుప్తంగా

అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును అందజేస్తున్న ఓయూ డాక్టర్ మహ్మద్ అక్తర్‌అలీ

కాచిగూడ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్.రఘునందన్‌కు అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ అవార్డును అందజేశారు. డాక్టర్ రాజ్‌నారాయణ, విద్యావేత్త జక్కుల విజిత, యం.కామరాజు, కాశమోని శ్యామ్‌రావుముదిరాజ్ తదితరులున్నారు.

నాయీ బ్రాహ్మణ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

కాచిగూడ: ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని బీసీ కులాలు అభివృద్ధిలోకి రావాలని రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. సోమవారం కాచిగూడలో 'నాయీ బ్రాహ్మణ డాట్ కామ్' సంస్థ రూపొందించిన నాయీ బ్రాహ్మణ 'వెబ్ పోర్టల్'ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృత్తుల ఆధునీకరణ, బుత్తి పరికరాలలో నవీకరణ, సాంకేతిక నైపుణ్యాలు సాధించే దిశగా నూతన సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. సంస్థ వ్యవస్థాపకుడు నడిగొట్టు సంతోష్‌కుమార్, కళరాజ్, మర్రి శ్రీనివాస్, ఎస్.తిరుపతి, రాకేష్ చేర్యాల తదితరులున్నారు.

వేడుకగా బతుకమ్మ



విద్యార్థినులతో లెక్చరర్లు, సిబ్బంది తదితరులు

కాచిగూడ: నారాయణగూడలోని భవన్స్ న్యూసైన్స్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సంప్రదాయ దుస్తుల్లో అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ ఆడి సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పేరాల కిషన్ రావు, చైర్మన్ డాక్టర్ పెరుంబదూర్ జైకిషన్ వేడుకలను ప్రారంభించారు. తాము తీసుకొచ్చిన బతుకమ్మలను విద్యార్థినులు అందంగా పేర్చి ఆడి, పాడుతూ.. సందడి చేశారు.

గాంధీనగర్‌లో..



గాంధీనగర్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ ఆడిపాడి వేడుకలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య పార్కులో ఘనంగా బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. పలువురు వాకర్స్ మహిళలు బతుకమ్మలను అందంగా ముస్తాబు చేసి తీసుకొచ్చి బతుకమ్మలు ఆడిపాడారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టో సబ్బండ వర్గాలకు మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

కాచిగూడ: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ డివిజన్, విఠల్‌వాడీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మేనిఫెస్టో సబ్బండ వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని వారు తెలంగాణలో అధికారంలోకి వస్తే గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని చెబుతున్నారని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీఆర్ఎస్ నేతలు యాదగిరి, రూపేష్, రోహిత్, ప్రభాకర్‌గౌడ్, రాజేందర్ కుమార్, సర్ఫరాజ్ పాల్గొన్నారు.

గాయత్రి దేవీ నమోస్తుతే !

అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ పరిధిలో గాయత్రి దేవీగా అమ్మవారు దర్శనమిచ్చారు. సోమవారం పలువురు ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేయగా.. న్యూ రామాలయం, శంకరమఠం, దేవాలయాల్లో అమ్మవారు మంగళగౌరీగా, మహేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారిని వేడుకున్నారు.



బతుకమ్మ కుంట ఆలయంలో గాయత్రీదేవీ అలంకరణలో..



న్యూ రామాలయంలో మంగళగౌరీ అలంకరణలో అమ్మవారు



శంకరమఠంలో మహేశ్వరి అలంకరణలో శారదామాత



అంబర్‌పేట మహంకాళి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు



చిత్రాల్ నగర్ జై మాతా ఫ్రెండ్స్ అసోసియేషన్‌లో..



అమ్మవారికి పూజలు చేస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

ప్రవల్లిక కుటుంబానికి న్యాయం చేయాలని వినతి



గవర్నర్ తమిళిసైను కలిసిన బీజేపీ నాయకురాలు కె.గీతామూర్తి

కాచిగూడ: పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న ప్రవల్లికది ప్రభుత్వ హత్యేనని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని బీజేపీ నాయకురాలు కె.గీతామూర్తి అన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధుల బృందం సోమవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ.. గ్రూప్ పరీక్షలు, డీఎస్సీ పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసారి వాయిదా వేయడంతో తన తండ్రికి ఈ విషయం చెప్పి ఇక పరీక్షలు ఉండవేమో అనే మనస్తాపంతో తాను ఆత్మహత్య చేసుకుందని వివరించారు. దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో గవర్నర్ సానుకూలంగా స్పందించి ప్రవల్లిక కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతీలత, ప్రసన్న, విశాలిని తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల డిమాండ్లపై వినతి



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: మున్నూరుకాపుల డిమాండ్లను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ.. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరుకాపులకు జనాభా ప్రాతిపదికన 20 సీట్లు కేటాయించాలన్నారు. మున్నూరుకాపులను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే మున్నూరుకాపుల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. విస్మరించిన పార్టీలకు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. గాడికర్ల సత్యనారాయణ, అనంతుల ప్రహ్లాద్, రవికాంత్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవల్లిక కుటుంబానికి మంత్రి క్షమాపణ చెప్పాలి

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్



ముషీరాబాద్: ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థి ప్రవల్లిక అసలు గ్రూప్స్ కోసం దరఖాస్తే చేసుకోలేదని మంత్రి కేటీఆర్ వాఖ్యానించడంపై సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబానికి మంత్రి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం అడిక్‌మెట్‌లో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతను తన మాటలతో కేటీఆర్ అవమానించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్స్ కోసం ప్రవల్లిక చేసుకున్న దరఖాస్తులను, హాల్ టికెట్లను ప్రదర్శించారు. సమస్యను పక్కదారి పట్టించేందుకు పోలీసులు, మంత్రి కేటీఆర్ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. 2018 నుంచి రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని ఎద్దేవా చేశారు.

◆ చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌ను ఎందుకు సస్పెండ్ చేశారని ఆయన ప్రశ్నించారు. తమ స్వార్థ రాజకీయాల కోసం అధికారులను బలి చేస్తున్నారని వేల సంఖ్యలో నివాసాలు ఉండే అశోక్‌నగర్ లాంటి ప్రాంతాల్లో ఒక ఘటన జరిగినప్పుడు తప్పకుండా వేలాది మంది హాజరవుతారన్నారు. పరిస్థితిని అదుపు చేయడం ఒక ఇన్‌స్పెక్టర్‌తో సాధ్యం కాదని వివరించారు. 'వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగ యువత బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కాంగ్రెస్ కాపీ..

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కాంగ్రెస్ మ్యానిఫెస్టోను కాపీ కొట్టిందని ఆయన విమర్శించారు. తాము గ్యాస్ సిలిండర్ రూ.500లకు ఇస్తామంటే.. బీఆర్ఎస్ పార్టీ రూ.400లకు ఇస్తామని చెబుతుందన్నారు. రైతు భరోసా తదితర పథకాలను బీఆర్ఎస్ పార్టీ కాపీ కొట్టిందన్నారు. జర్నలిస్టులను కూడా బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని అక్రిడెషన్ కార్డు ఉంటే రూ.400లకు గ్యాస్ వంటి పథకాలను పెట్టి జర్నలిస్టులను అవమానించారన్నారు.

కేంద్రమంత్రికి సత్కారం



కేంద్రమంత్రి సాధ్వినిరంజన్ జ్యోతిని సత్కరిస్తున్న బీజేపీ నేత డీఎస్‌రెడ్డి

చిక్కడపల్లి: గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతిని ముషీరాబాద్ అసెంబ్లీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు డీఎస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. పార్టీ బలోపేతం, గెలుపుకోసం చేస్తున్న కృషిని కేంద్రమంత్రికి వివరించారు. బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి, పద్మజ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: బాక్సింగ్ జాతీయ పోటీల్లో బ్రాస్ మెడల్ సాధించిన గాంధీనగర్‌కు చెందిన ప్రశాంత్‌ను సోమవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహలు ఘనంగా సన్మానించారు. ప్రశాంత్ రాష్ట్ర పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఆల్ ఇండియా పోలీస్ బాక్సింగ్ నేషనల్ గేమ్స్‌లో మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని వివరించారు. బాబ్జి, శ్రీనివాస్‌గుప్తా, ప్రభ, సంపత్‌కుమార్‌గౌడ్, వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రభాకర్, శంకర్ తదితరులున్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

ముషీరాబాద్: 14వ జూనియర్ విభాగం జాతీయ ఖోఖో చాంపియన్‌షిప్-2023 పోటీలు ఇటీవల రాజస్థాన్‌లో జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ విద్యార్థినులను హెచ్.వశిష్ఠ, ఆరాధన, కోచ్, ప్రిన్సిపల్ సిస్టర్ లిండాజరాల్డ్ అభినందించారు.

9 మంది పాత నేరస్తుల బైండోవర్

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని ఆర్డీఓ ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం 9 మంది పాతనేరస్తులు, అనుమానితులను బైండోవర్ చేసినట్లు ఆయన ప్రకటించారు.

వ్యక్తి మృతదేహం స్వాధీనం

కాచిగూడ: ఓ వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం డబీల్‌పుర రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం -1పై ఓ వ్యక్తి (48) మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాగా మృతుడు బిక్షాటన చేసి జీవించే మధుసూదన్‌రావుగా పోలీసులు గుర్తించారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు

ముషీరాబాద్: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై యువత ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ జేబీ అపార్ట్‌మెంటు వద్ద దూలం శ్రీనివాస్‌గౌడ్, నాగుల సాగర్ సంయుక్తాధ్వర్యంలో యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. నిరంతరం పేద ప్రజల కోసం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, మాజీ అధ్యక్షుడు ఆర్. రాంచందర్, నాయకులు రాజశేఖర్‌గౌడ్, ప్రభాకర్, విజయ్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, దుర్గాస్వామి, శ్రీహరి, కె. కిరణ్, సందీప్, సంతోష్, రాజు, జమాలుద్దీన్, రవియాదవ్ తదితరులున్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ముఠాగోపాల్

బీ - ఫారమ్ అందుకున్న ఎమ్మెల్యేలు



సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు సీఎం కేసీఆర్ బీఫాం అందజేశారు. సోమవారం ప్రగతి భవన్‌లో బీఫాంతో పాటు ఎన్నికల ఖర్చు కోసం రూ.40 లక్షల చెక్కును అందజేశారు. ఎన్నికల్లో విజయం సాధించి రావాలని సీఎం ఆశీర్వదించినట్లు కాలేరు వెంకటేష్ తెలిపారు.



ముఠా గోపాల్

ముషీరాబాద్: నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ టికెట్‌ను దక్కించుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సీఎం క్యాంప్ కార్యాలయంలో బీ-ఫామ్‌ను అందుకున్నారు. అనంతరం సోమవారం ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీ గణపతి దేవాలయం, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి దగ్గర బీ- ఫామ్‌ను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

కార్మిక, ఉద్యోగ సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పొందుపరచాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్పాదక రంగం, సేవల రంగం, సంక్షేమ పథకాల అమలులో కార్మికులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కలిగించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను కేంద్రం ఉపసంహరించుకోవాలన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ఆర్.డీ.చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు బాల్‌రాజ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కె.సూర్యం, ఎం.శ్రీనివాస్, అనురాధా, జనార్థన్, టీఎన్‌టీయూసీ నాయకులు ఎం.కె.బోస్, ఏఐయూటీయూసీ నాయకులు భరత్, సీఐటీయూ నాయకులు జె.వెంకటేష్ తదితరులున్నారు.

కంటోన్మెంట్ టికెట్ మాదిగలకు కేటాయించాలి

కంటోన్మెంట్: ప్రధాన రాజకీయ పక్షాలు కంటోన్మెంట్ అసెంబ్లీ టికెట్‌ను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నేత ఇటుక శ్రీ కిషన్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు టికెట్ కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. మాదిగలను పక్కన పెట్టాలని భావించిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పుతామన్నారు. ఇకనైనా అన్ని ప్రధాన పార్టీలు ఆలోచించి మాదిగలకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. అజిత్ కల్యాణ్ వాల్మీకి, బ్యాగరీ నరసింహ, మంద మధుకర్ మాదిగ, చింతల చెరువు అంజమ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీ కిషన్

ముషీరాబాద్ టికెట్టు ఇవ్వండి !



దరఖాస్తు చేసుకున్న ఆకుల ప్రవీణ్

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్‌టీపీ తరుపున ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల ప్రవీణ్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం వైఎస్ఆర్‌టీపీ కార్యకర్తలతో కలిసి పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో అధిష్టానానికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. పార్టీ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. నాయకులు మునీరం నాయుడు, కిషన్, సాయిబాబా, ప్రశాంత్, ఆనంద్‌కుమార్, నాగరాజు, మహేందర్, వెంకటేష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ సీనియర్లకు స్థానం లేదా..?

ముషీరాబాద్: నియోజవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు స్థానం లేనట్లే కనిపిస్తోందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లవెల్లి అంజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశించి తాను భంగపడ్డానన్నారు. స్థానికేతరుడైన అంజన్‌కుమార్‌యాదవ్‌కు టికెట్ కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పోటీ పడుతున్న అభ్యర్థులను పిలిచి మాట్లాడి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జీ.ఎస్.చారి, సీనియర్ నాయకులు రామకృష్ణ, రాజ్‌కుమార్, గోపాలకృష్ణ, విజయ్‌కుమార్, కె.పాండు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నల్లవెల్లి అంజిరెడ్డి

మొదలైన బీఆర్ఎస్ ప్రచార పర్వం

అంబర్‌పేట: బీఆర్ఎస్ ప్రచార పర్వం ప్రారంభమైంది. సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, బి.పద్మ, నాయకులు వెంకట్‌రెడ్డి, సిద్దార్థ ముదిరాజ్, రవీందర్‌రావు, సతీష్, శ్రీరాములుముదిరాజ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్..

◆ బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులకు తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఛే నంబర్‌లోని ఆయన నివాసంలో మాట్లాడుతూ.. పార్టీ కోసం ఉద్యమ కాలం నుంచి వ్యాపారాలు వదులుకుని పనిచేశామని, తమను పార్టీ అధిష్టానం విస్మరించడం దారుణమన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రజకులకు సీట్ల కేటాయింపై హర్షం..

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో రజకులకు సీట్లు కేటాయించిన కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలకు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి కృతజ్ఞతలు తెలిపారు. రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కోశాధికారి ఓరుగంటి వెంకటయ్య అధ్యక్షతన సోమవారం కాచిగూడలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాటం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని, కేసీఆర్ అవినీతి నియంతృత్వ దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు, సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులు పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామిక ప్రత్యామ్నాయం రావాలని లేకుంటే భవిష్యత్తు అంధకారంలో ఉంటుందన్నారు. కేంద్రం వనరులపైన గుత్తాధిపత్యాన్ని సాధించి నిరంకుశంగా వ్యవహరిస్తూ.. ప్రజల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ.వినాయకరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ ప్రతినిధి డాక్టర్ షంషూల్ ఇస్లామ్, టీఎస్‌డీఎఫ్ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ కార్యదర్శి పోటు రంగారావు, న్యూడెమొక్రస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జే.వీ.చలపతి రావు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, ఎస్‌యూసీఐ కార్యదర్శి సీ.హెచ్.మురహరి, ఎంఎల్ పార్టీ కార్యదర్శి ప్రసాదన్న, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకీరాములు తదితరులు పాల్గొని మాట్లాడారు.

సముచిత స్థానం కల్పిస్తామని భరోసా..



అంబర్‌పేట్: బీఆర్ఎస్ పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు బి. వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రగతిభవన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ పద్మతో పాటు ఆయన సీఎంను కలిశారు. ఇటీవల బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన అనంతరం మొదటిసారి సీఎం కేసీఆర్‌ను కలవడంతో భవిష్యత్తుపై భరోసా ఇచ్చారన్నారు.